సాక్షి నల్లగొండ

మంగళవారం, 13, జూన్, 2023



కుమారుడిని హత్యచేసిన తండ్రి

సూర్యాపేట పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన చీమల లింగయ్య తన కుమారుడు సతీష్‌ను హత్య చేశాడు. - 8లో



ట్రిపుల్ ఐటీ పిలుస్తోంది

బాసర ట్రిపుల్ ఐటీలో 2023-24 విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. - 10లో



వాతావరణం

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

రామగిరి(నల్లగొండ) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన ఫస్ట్ ఇయర్ పరీక్షకు 4,024 మంది విద్యార్థులకుగాను 3,710 మంది హాజరయ్యారు. 314 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండ్ ఇయర్ పరీక్షకు 1,440 మందికిగాను 1,315 విద్యార్థులు హాజరయ్యారు. 125 మంది గైర్హాజరయ్యారు.

బాలిక చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న లీగల్ సెల్ సెక్రటరీ బి.దీప్తి

రామగిరి(నల్లగొండ) : బాలిక చట్టాలపై నల్లగొండ కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో లీగల్ సెల్ సెక్రటరీ బి.దీప్తి అవగాహన కల్పించారు. సోమవారం ప్రపంచ బాల కార్మిక దినోత్సవం సందర్భంగా లీగల్ సెల్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలిక హక్కులు, చట్టాలను వివరించారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, కార్మిక శాఖ కమిషనర్ హలీం పాల్గొన్నారు.

20న సైన్స్ హాకథాన్ పోటీలు

రామగిరి(నల్లగొండ) : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లోని సైన్స్, గణిత సబ్జెక్టుల నైపుణ్యాలను వెలికితీసేందుకు జూన్ 20న సైన్స్ హాకథాన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 8వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : జిల్లాలోని రిజిస్టర్డ్ స్వచ్ఛంద సంస్థలు 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందడానికి దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులను సంక్షేమ భవన్‌లో సమర్పించాలని సూచించారు.

వృత్తి శిక్షణకు దరఖాస్తులు

రామగిరి(నల్లగొండ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఎస్సీ న్యాయవాద పట్టభద్రులు 2023-24 విద్యా సంవత్సరానికి న్యాయవాద వృత్తి శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డీడీ సల్మాబాను సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని బార్ కౌన్సిల్ నమోదు పత్రం జత చేసి ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో జూన్ 30వ తేదీలోపు దరఖాస్తు ఫారం సమర్పించాలని పేర్కొన్నారు.

గురుకులాల్లో ఇంటర్ అడ్మిషన్లకు ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : ఎస్సీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ గురుకులాల ఆర్‌సీఓ అరుణ కుమారి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. www.tswreis.ac.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లష్కర్ల నియామకానికి గ్రీన్ సిగ్నల్

గుర్రంపోడు : సాగునీటి పారుదల వ్యవస్థలో కాల్వల నీటిని క్రమపద్ధతిలో పంట పొలాలకు అందించడంలో లష్కర్‌లదే కీలకపాత్ర. ఏఎమ్మార్పీ పరిధిలోని 12 డివిజన్లకు ప్రభుత్వం 598 మంది లష్కర్ పోస్టులకు ప్రభుత్వం మంజూరు చేసింది. ఏఎమ్మార్పీ పరిధిలో ఇప్పటి వరకు లష్కర్లు లేకపోవడతో నీటిపారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. లష్కర్ల నియామకం పూర్తయితే నీటి పారుదల సక్రమంగా ఉండనుంది. రెవెన్యూ శాఖలోని వీఆర్‌ఓలను లష్కర్‌లుగా నియమించే అవకాశం ఉందని ఏఎమ్మార్పీ ఉన్నతాధికారులు అంటున్నారు.

శివాలయంలో పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు చేపట్టారు. స్వామి వారికి నిత్య పూజలు చేసిన అనంతరం రుద్రహవనం, అభిషేక, అర్చనలు గావించారు. గర్భాలయం, ముఖ మండపంలోని స్ఫటిక లింగానికి ఆచార్యులు పూజలు చేసి హారతినిచ్చారు. శివపార్వతుల కల్యాణ వేడుక, సేవోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.





తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎన్జీ కాలేజ్ వద్ద బెలూన్లను వదులుతున్న గుత్తా, కంచర్ల, కలెక్టర్, ఎస్పీ, 2కే రన్‌లో పాల్గొన్న గుత్తా తదితరులు

తొలిరోజు తక్కువగానే..

- పాఠశాలలకు అంతంతమాత్రంగానే హాజరైన విద్యార్థులు
- ఎండలు తగ్గకపోవడంతో బడికి పంపని తల్లిదండ్రులు
- ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల స్వాగతం
- కొన్ని చోట్ల స్కూళ్లను శుభ్రం చేసుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నల్లగొండ : వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభమైన తొలిరోజున తక్కువ సంఖ్యలోనే విద్యార్థులు హాజరయ్యారు. ఎండలు తగ్గకపోవడం, సోమవారం నవమి అని కూడా కొందరు తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపలేదు. ప్రభుత్వ పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. ప్రతి సంవత్సరం తొలిరోజు పాఠశాలకు వచ్చే పిల్లలు చాలా రోజుల తర్వాత స్నేహితులు కలిసిన ఆనందంతోపాటు వారికి కొత్త పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందేవి. కానీ ఈసారి ఆ పరిస్థితి లేదు. పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడంతో.. కొన్ని చోట్ల పంచాయతీ కార్మికులు ఊడ్చకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులే పరిసరాలను శుభ్రం చేసుకున్నారు. అటెండర్ కూడా లేకపోవడంతో పలుచోట్ల ఉపాధ్యాయులే గంట కొట్టుకున్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ముందురోజే స్కూళ్లకు వెళ్లి పంచాయతీ కార్మికులచే పాఠశాలలు శుభ్రం చేయించుకుంటే ఈ పరిస్థితి ఉండేది కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



నల్లగొండ : దేవరకొండలోని పాఠశాలలో గ్రౌండ్ ఊడ్చుతున్న విద్యార్థిని

జిల్లాలో 1,483 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలో వివిధ కేటగిరిల పరిధిలో 1,483 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటి పరిధిలో 2,27,000 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. పాఠశాలల్లో సిబ్బంది కొరత ఉంది. ప్రభుత్వం కొత్తగా అటెండర్లు, స్వీపర్ పోస్టులు భర్తీ చేయకపోవడం, స్కావెంజర్లను తొలగించడంతో పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాలలను శుభ్రపర్చాల్సిన బాధ్యతను ప్రభుత్వం గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు అప్పగించింది. కానీ, వారికి గ్రామాలను శుభ్రం చేసేందుకే సమయం సరిపోవడం లేదు. కొన్ని చోట్ల వారు పాఠశాలలను ఊడ్చడం లేదు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభ్రం చేసుకుంటుండగా.. మరికొన్ని చోట్ల ఉపాధ్యాయులు వర్కర్లను పెట్టుకొని శుభ్రం చేయిస్తున్నారు.

పదుల సంఖ్యలోనే పిల్లలు..

జూన్ మూడో వారం ప్రారంభమైనా ఎండలు తగ్గలేదు. సోమవారం కూడా 40 డిగ్రీల పైచిలుకే ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో మొదటిరోజు విద్యార్థులు పాఠశాలలకు తక్కువగా హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా అత్యధిక పాఠశాలల్లో 20 మందిలోపే విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

- నల్లగొండ పట్టణంలోని డైట్ స్కూల్‌లో 420 మంది విద్యార్థులకుగాను 15 మంది హాజరయ్యారు.
- నల్లగొండ దేవరకొండ రోడ్డులోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో 200 మందికి 16 మందే హాజయ్యారు.
- పోలీస్ లైన్స్ స్కూల్‌లో ఐదుగురు మాత్రమే హాజయ్యారు.
- నల్లగొండలోని బాలికల ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతిలో ఇద్దరు విద్యార్థినులే హాజరయ్యారు.
- హాలియాలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 200 మంది విద్యార్థులకు గానూ 25 మంది హాజరయ్యారు.







నల్లగొండ : డైట్ స్కూల్‌కు వస్తున్న విద్యార్థినులు, బాలికల పాఠశాలలో తరగతి గదిలో ఇద్దరు విద్యార్థినులు, ఓ స్కూల్‌లో గంట కొడుతున్న ఉపాధ్యాయురాలు

గ్రీవెన్స్ డేలో వినతుల వెల్లువ

నల్లగొండ : కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డేకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రెండు వారాలుగా గ్రీవెన్స్ డే నిర్వహించకపోవడంతో ఈ వారం ఫిర్యాదుదారులు కలెక్టరేట్‌కు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. బాధితుల నుంచి అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఫిర్యాదులను స్వీకరించారు. వారి సమస్యను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అక్కడే అధికారులను ఆదేశించారు. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత మండలాల తహసీల్దార్లకు ఫోన్ చేసి వాటిని పరిష్కరించాలని సూచించారు. గ్రీవెన్స్ డేలో భూ సమస్యతోపాటు పింఛన్లు, డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించిన వినతులే అధికంగా వచ్చాయి.



కలెక్టరేట్‌కు వచ్చిన మానసిక దివ్యాంగ బాలిక, తల్లి

నేరెడుగొమ్ము మండలం కేతేపల్లి గ్రామానికి చెందిన మహిళ తన 12 ఏళ్ల కూతురు వడిత్యా అంజలి మానసిక వికలాంగురాలు అని.. మూడేళ్ల నుంచి పింఛన్ రావడం లేదని.. పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా పింఛన్ మంజూరు కాలేదని బాలికతో కలిసి అదనపు కలెక్టర్‌కు విన్నవించింది. స్పందించిన ఆయన పింఛన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదులను సమగ్రంగా విచారించాలి

నల్లగొండ క్రైం : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును సమగ్రంగా విచారించి బాధితులకు న్యాయం చేస్తేనే పోలీస్ శాఖపై ప్రజల్లో గౌరవం, నమ్మకం ఉంటుందని ఎస్పీ అపూర్వరావు అన్నారు. పోలీస్ గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి సోమవారం ఆమె ఫిర్యాదులు తీసుకుని మాట్లాడారు. ఎక్కువగా భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, ఫైనాన్స్ విషయాలపై ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. వివాదాలు శాంతిభద్రతల సమస్యగా మారకముందే తగిన చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు.

నేడు తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం

నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి సాధించిన అభివృద్ధి, సంక్షేమంపై ఈ సందర్భంగా చర్చించనున్నారు.

అదనపు కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందించడానికి కలెక్టరేట్‌కు వచ్చిన పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు

నల్లగొండ : గ్రామపంచాయతీలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు సమ్మె నోటీసు అందించారు. ఈనెల 20వ తేదీ తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి పోతామని తెలిపారు. ప్రధానంగా జీఓ 60 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని వారు కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని కొంత కాలంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం వారి సమస్యను పరిష్కరించక పోవడంతో ఈనెల 5న పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘం జేఏసీ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సమ్మె నోటీసు అందజేశారు. అందులో భాగంగానే కలెక్టర్, డీపీఓలకు సమాచారం అందించేందుకు సోమవారం అదనపు కలెక్టర్‌కు సమ్మె నోటీసును అందించారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ క్రైం : సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన తెలంగాణ 2కే రన్‌ను నాగార్జున కళాశాల వద్ద బెలూన్లు వదిలి, జెండా ఊపి గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు, పట్టణవాసులతో కలిసి రన్నింగ్‌లో పాల్గొన్నారు. అనంతరం క్లాక్ టవర్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరం ఆరోగ్యంగా ఉంటేనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పట్టణాలు, పల్లెలు గొప్పగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. పార్కులు, క్రీడా ప్రాంగణాలు అన్నింటినీ అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనతో నల్లగొండ పట్టణం గొప్పగా అభివృద్ధి చెందుతోందన్నారు. అత్యధికంగా మెడికల్ కాలేజీలు ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని గర్వంగా చెప్పవచ్చాన్నారు. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రూ.1200 కోట్లతో నల్లగొండ పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎస్పీ అపూర్వరావు, బెటాలియన్ కమాండెంట్ సాంభయ్య, అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అడిషనల్ ఎస్పీ కెఆర్‌కె.ప్రసాదరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



2కే రన్‌లో విజేతలకు మెడల్స్, సర్టిఫికెటు అందజేస్తున్న గుత్తా, కంచర్ల

స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

- రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తాం
- ప్రజలకు హామీ ఇచ్చిన సీఎల్పీ నేత భట్టి
- గుర్రంపోడు మండలంలో సాగిన పాదయాత్ర

గుర్రంపోడు : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సోమవారం కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవల్లి నుంచి గుర్రంపోడు మండలంలోని పాల్వాయి, గుడిపల్లి క్రాస్‌రోడ్డు, జూనూతల స్టేజీ మీదుగా తానేదార్‌పల్లి స్టేజీ, చేపూరు స్టేజీ వరకు కొనసాగింది. పాదయాత్రకు పాల్వాయి గ్రామ శివారులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. డప్పుల చప్పుడు, మహిళల మంగళ హారతులతో భట్టి విక్రమార్కకు స్వాగతం పలికారు. పలువురు ఆయనకు శాలువాలు కప్పి సన్మానించారు. పాదయాత్రలో భాగంగా భట్టి విక్రమార్క రోడ్డు పక్కన నిల్చున్న వృద్ధులు, మహిళలను పలుకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ పనుల్లో ఉన్న కూలీలు పరుగుపరుగున రోడ్డు మీదకు వచ్చి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తమ బిడ్డలకు ఉద్యోగాలు లేవని, తాము ఇందిరమ్మ కట్టించిన ఇళ్లలోనే ఉంటున్నామని, రుణమాఫీ కాలేదని పలువురు సీఎల్పీ నేత దృష్టికి తెచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వలేదని, రేషన్ షాపుల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నారని, గ్యాస్ రేటు పెరిగి ఇంత ధర పెట్టి కొనలేక పోతున్నామని పార్వతమ్మ అనే మహిళ చెప్పగా కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే అధికారంలోకి వస్తుందని అందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని, వంట గ్యాస్ రూ.500కే ఇస్తామని చెప్పారు. ఉపాధి కూలీ తమకు డబ్బులు అందడం లేదని చెప్పుకున్నారు. భార్య భర్తల్లో ఒక్కరికే పింఛన్ వస్తోందని పాల్వాయి గ్రామానికి చెందిన మహిళలు కళమ్మ, కల్పన, యాదమ్మ చెప్పగా.. త్వరలోనే ఇందిరమ్మ రాజ్యం వచ్చాక భార్యభర్తలకు ఫించను వస్తుందని హామీ ఇచ్చారు. పాల్వాయి గ్రామంలో రోడ్డు పక్కన ఓ వైద్యశాలలో భట్టి విక్రమార్క వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కుందూరు జైవీర్‌రెడ్డి తానేదార్‌పల్లి స్టేజీ వద్ద భట్టితో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, జాలచినసత్తయ్య యాదవ్, జగదీశ్వర్‌రెడ్డి, యాదగిరిగౌడ్, మేడి వెంకన్న, గట్టుపల్లి మణిపాల్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, మరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.



వైద్య పరీక్ష చేయించుకుంటున్న భట్టి



గుర్రంపోడు మండలంలోని పాల్వాయిలో వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న భట్టి విక్రమార్క

సన్నాల సాగుకు సన్నద్ధం

- పచ్చి ధాన్యమే కొనుగోలు చేసి మంచి ధర ఇస్తున్న మిల్లర్లు
- 25నుంచి 30 శాతం తేమ ఉన్నా ఇబ్బంది లేదు
- యాసంగిలో క్వింటాకు రూ.2000 నుంచి రూ.2500 వరకు పలికిన ధర
- ఈ వానాకాలంలో సన్నాల సాగు పెరుగుతుందని అంచనా



నల్లగొండ అగ్రికల్చర్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతులు సన్నరకం వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. యాసంగిలో సన్నరకం సాగు చేసిన రైతులు వానాకాలంలో కూడా వాటినే సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో అత్యాధునిక రైస్ మిల్లులు ఉండడం, ఆయా మిల్లుల యాజమాన్యం ధాన్యంలో తేమ శాతం 25 నుంచి 30 వరకు ఉన్నా ఎలాంటి అభ్యంతరం చేయకుండా క్వింటాకు రూ.2 వేల నుంచి రూ.2500 వరకు చెల్లించి కొనుగోలు చేస్తుండడంతో సన్నాలు సాగు చేసి వెంటనే విక్రయించుకుందామనే ఆలోచనలో ఉన్నారు.

దొడ్డు రకం విక్రయంలో ఇబ్బందులు

గత యాసంగి సీజన్‌లో నల్లగొండ జిల్లాలో 5.56 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా అందులో సన్నరకం 1.20 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. సూర్యాపేట జిల్లాలో 4.67 లక్షల ఎకరాల్లో సాగు చేయగా.. అందులో సన్నరకం 1.15 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. దొడ్డురకం వరిసాగు చేసిన రైతులు ధాన్యం ఆరబెట్టి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. దొడ్డు రకం వరి పంటకాలం కూడా ఎక్కువ ఉంటోంది. దీంతో రెండేళ్లుగా జిల్లాలో రైతులు తక్కువ కాలంలో చేతికి వచ్చే సన్నాలను సాగు చేస్తున్నారు. దొడ్డు రకం ఎకరానికి 35 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుండగా, సన్నరకం 40 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వస్తుడడంతో రైతులు ఆ వైపు మొగ్గు చూపుతున్నారు.

పచ్చి ధాన్యమే కొనుగోలు..

సన్నధాన్యంలో తేమ శాతం 25 నుంచి 30 శాతం వరకు ఉన్నా మిల్లర్లు కొనుగోలు చేయడంతో తూకం కూడా అధికంగా వస్తోంది. ధర కూడా దొడ్డురకం కంటే ఎక్కువ వస్తుండడంతో రైతులు సన్నాలవైపు మొగ్గుచూపారు. సన్నరకాల్లో చిట్టిపొట్టి రకం విత్తనం ఎత్తు పెరగకపోవడంతో పాటు తెగుళ్లను కూడా తట్టుకోవడం వల్ల ఆ రకాన్ని రెండేళ్లుగా రైతులు ఎక్కువ సాగు చేశారు. తక్కువ ఎత్తు పెరగడం వల్ల ఈదురుగాలులు, అకాల వర్షాలు వచ్చినా పంటనష్టం జరగలేదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు 50 బస్తాల దిగుబడి వచ్చింది

యాసంగిలో నేను నాలుగు ఎకరాల్లో చిట్టిపొట్టి రకం సన్నాలు సాగు చేశాను. ఎకరానికి 50 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. ధర కూడా క్వింటాకు రూ.2300 మిల్లులో కొన్నారు. పచ్చిధాన్యం కాబట్టి తూకం కూడా బాగా వచ్చింది. ఈ వానాకాలంలో 10 ఎకరాల్లో చిట్టిపొట్టి రకం సాగు చేయాలనుకుంటున్నాను.

– సుంకరి సైదులు, గుంజలూరు, చివ్వెంల మండలం

సన్నాలు సాగు చేయడం మంచిది



యాసంగిలో రైతులు ఎక్కువగా చిట్టిపొట్టి రకం సన్నాలు సాగు చేశారు. దిగుబడి కూడా ఎకరానికి 45 నుంచి 50 బస్తాల వరకు వచ్చింది. వానాకాలంలో సన్నాల సాగు బాగా పెరిగే అవకాశం ఉంది. వరిసాగు ముందుకు తీసుకురావాలని ప్రభుత్వం కోరిన నేపథ్యంలో రైతులు సన్నాలు సాగు చేయడం మంచిది. ఉమ్మడి జిల్లాలో రైతులు ఇప్పటికే సన్నరకం వరి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.

– వై.సుచరిత, డీఏఓ

వానాకాలంలో రెండింతలయ్యే అవకాశం..

ప్రస్తుత వానాకాలంలో సన్నాల సాగు యాసంగి కంటే రెండింతలయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనాలు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పంటకాలం ముందుకురావాలని సూచించిన నేపథ్యంలో తక్కువ కాలంలో 120-130 రోజుల్లో కోతకు వచ్చే సన్నరకం వరి సాగును పెంచే అవకాశం ఉందంటున్నారు. ఆయకట్టుతో పాటు నాన్‌ఆయకట్టులో నల్లగొండ జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాల్లో, సూర్యాపేట జిల్లాలో 2.50 లక్షల ఎకరాల్లో సన్నరకం వరి సాగు చేయవచ్చని వ్యవసాయశాఖ అంచనా వేస్తున్నారు.

క్లుప్తంగా

గాయపడిన డ్రైవర్ మృతి


ఇక్రమ్‌ఖాన్ మృతదేహం

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఎండి.ఇక్రమ్‌ఖాన్(43) ఎల్‌పీజీ గ్యాస్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వృత్తిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో ఈ నెల 10న లారీ లోడ్ చేసుకున్నాడు. హైదరాబాద్‌లో ఖాళీ చేసేందుకు బయలుదేరాడు. ఆ క్రమంలో అదే రోజు రాత్రి 11 : 30 గంటల ప్రాంతంలో చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెం గ్రామ శివారులో అండర్‌పాస్‌పై ట్యాంకర్ మరమ్మతుకు గురవ్వడంతో డ్రైవర్ వాహనాన్ని రోడ్డు ఎడమ వైపున నిలిపి పరిశీలిస్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ వైపుకే వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లారీ డ్రైవర్ ఇక్రమ్‌ఖాన్‌ను చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు జీషాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సీత పాండు తెలిపారు.





ఖిలాపై 200 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన


భువనగిరి ఖిలాపై 200 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న అధికారులు, యువకులు


జెండా ఎగురవేసిన అనంతరం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, డీసీపీ రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెలంగాణ రన్ సందర్భంగా భువనగిరి ఖిలాపైకి 2కె రన్ నిర్వహించారు. ఖిలాపై జాతీయ జెండా ఎగురవేశారు. ఖిలాపైనున్న రాణిమహల్ చుట్టూ 200 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, రాచకొండ పోలీస్ కమిషనరేట్ జాయింట్ సీపీ సత్యనారాయణతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, యువకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. – సాక్షి, యాదాద్రి

జాతీయ రహదారిపై ఇసుక తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

చిట్యాల : జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు జీఎంఆర్ సంస్థ చర్యలకు ఉపక్రమించింది. మితిమీరిన వేగం, రహదారిపై పేరుకుపోతున్న ఇసుక కారణంగా వాహనాలు అదుపుతప్పడంతో జరుగుతున్న ప్రమాదాలపై ఈ నెల 11న 'సాక్షి' దినపత్రికలో 'ఎగిరి ఢీకొడుతున్నాయ్' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జీఎంఆర్ కాంట్రాక్టర్ హైవేపై పేరుకుపోయిన ఇసుకను సోమవారం ట్రాక్టర్‌తో ఏర్పాటు చేసిన స్పాంజ్ క్లీనర్‌తో పాటు కూలీలతో తొలగించారు.


చిట్యాలలో రోడ్డుకు ఇరువైపులా ఇసుక తొలగిస్తున్న జీఎంఆర్ సిబ్బంది

రహదారిపై గుంతను తప్పించబోయి..

- స్కూల్ బస్సును ఢీకొని వ్యక్తి మృతి


యాకూబ్‌అలీ (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి) : రహదారిపై అధికారులు నిర్లక్ష్యంగా వదిలేసిన గుంతను తప్పించబోయి ఓ ద్విచక్ర వాహనదారుడు స్కూల్ బస్సును ఢీకొని మృతిచెందాడు. తిరుమలగిరిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరిలోని గణేశ్ ఆలయం సమీపంలో సూర్యాపేట – జనగామ ప్రధాన రహదారిపై రెండు నెలల క్రితం మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. అధికారులు అప్పట్లో గుంత తీసి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. గుంతను సగం మాత్రమే పూడ్చి అలానే వదిలేశారు. గుంత కనిపించకుండా స్టాపర్‌ను ఏర్పాటు చేశారు. అయితే, తిరుమలగిరి పట్టణ కేంద్రానికి చెందిన ఎస్.కె.యాకూబ్‌అలీ(57) ఓ బట్టల షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం తిరుమలగిరి క్రాస్ రోడ్డుకు బైక్‌పై వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా గణేశ్ ఆలయం సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సును ఢీకొట్టి ఎగిరి రోడ్డు డివైడర్‌పై పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని స్థానిక పోలీసులు సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం


కూతురు మనశ్రీతో సౌజన్య (ఫైల్)

శాలిగౌరారం : తల్లి మందలించిందని కూతురు తన ముగ్గురు పిల్లలతో అదృశ్యమైంది. శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధి బాలిశెట్టిగూడేనికి చెందిన తాటిపాముల శంకరయ్య–పాపమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె సౌజన్యను హైదరాబాద్‌కు చెందిన మల్లెపాక దిలీప్‌కు ఇచ్చి తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిపించారు. ప్రస్తుతం ఈ దంపతులకు మనశ్రీ, మోగనాద్, పాండు సంతానం . 9 నెలల క్రితం భర్తతో గొడవపడిన సౌజన్య ముగ్గురు పిల్లలతో వచ్చి తల్లివద్దనే ఉంటుంది. ఈక్రమంలో ఆదివారం రాత్రి తల్లిబిడ్డలు మాట్లాడుకునే క్రమంలో భర్త వద్దకు వెళ్లాలని కుమార్తె సౌజన్యకు తల్లి పాపమ్మ సూచిస్తూ మందలించింది. ఈ క్రమంలో తల్లీకూతుళ్ల మధ్య స్వల్ప వివాదం జరిగింది. సోమవారం పాపమ్మ ఉపాధిహామీ పనులకు వెళ్లగా సౌజన్య తన ముగ్గురు పిల్లలను తీసుకొని ఇంటినుంచి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన పాపమ్మ కుమార్తె కనిపించకపోవడంతో అల్లుడు, బంధువులకు ఫోన్ చేసి ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. దీంతో పాపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురిపై కేసు

చివ్వెంల(సూర్యాపేట) : కలెక్టర్ కార్యాలయంలో అనుమతి లేకుండా ధర్నా చేస్తూ అడ్డుకున్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ఐదుగురిపై చివ్వెంల పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన ఓర్సు అశోక్, హేమలత, ఓర్సు మల్లయ్య, ఓర్సు శివ, ఓర్సు సూర్యా గ్రామంలో తమకు కోళ్లఫాం నిర్వహణకు అనుమతి ఇవ్వడం లేదని సోమవారం అనుమతి లేకుండా ధర్నా చేస్తూ కలెక్టరేట్‌లోకి చొరబడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అడ్డుకోబోయిన పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించినందుకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

అడ్డగూడూరు : అడ్డగూడూరు మండలం మంగమ్మగూడెంలోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. మంగమ్మగూడేనికి చెందిన కడారి భాస్కర్ హైదరాబాద్‌లో ఉంటుండగా ఆయన తల్లిదండ్రులు శాంతయ్య, మల్లయ్య గ్రామంలోని ఇంట్లో నివాసిస్తున్నారు. వృద్ధ దంపతులు ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఇంటి ఆవరణలో పడుకున్నారు. తెల్లవారుజామున టీవీ, కేబుల్ కాలిపోయి పొగ వ్యాపించింది. గమనించిన దంపతులు కేకలు వేయడంతో స్థానికులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అప్పటికే టీవీతో పాటు ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. రెండు రోజుల క్రితం లోకల్ కేబుల్ వారు కొత్త సెటప్‌బాక్స్ అమర్చారు. షార్ట్ సర్క్యూట్‌కు అదే కారణమని శాంతమ్మ, మల్లయ్య ఆరోపించారు.

మునగాల మండలం రేపాలలో..

మునగాల : షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసెలోని గాలి మిషన్ దగ్ధమైంది. ఈ ఘటన మునగాల మండలం రేపాలలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు సొంపంగు నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈదురుగాలికి షార్ట్‌సర్క్యూట్ జరిగి నాగరాజు గాలి మిషన్ దుకాణంలో మంటలు చేలరేగాయి. దీంతో పూరిగుడిసెతో పాటు గాలిమిషన్, ఇతర సామగ్రి కాలిపోయాయి. స్థానికులు స్పందించి మంటలు ఆర్పివేశారు.

చికెన్ సెంటర్ సీజ్

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో దుర్వాసన వస్తున్న కోడి మాంసం విక్రయిస్తున్న స్నేహ చికెన్ సెంటర్‌ను సోమవారం మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. వినియోగదారుల ఫిర్యాదుతో చికెన్ దుకాణాన్ని సందర్శించి కోడి మాంసాన్ని పరిశీలించారు. దుకాణంలో మాంసం దుర్వాసన వస్తుండటంతో నిర్వాహకులను అధికారులు హెచ్చరించారు. నాణ్యమైన కోడి మాంసం మాత్రమే విక్రయించాలని, లేని యెడల ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ హెచ్చరించారు. వారి వెంట మున్సిపల్ సిబ్బంది శ్రావణ్, సంతు, నర్సింహాచారి, నరేందర్, నాగరాజు, రమేష్‌లు ఉన్నారు.

ట్రాక్టర్, ఆటో ఢీ.. పలువురికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: ట్రాక్టర్, ఆటో ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామ పరిధి పిట్టలగూడెం చౌరస్తా వద్ద సోమవారం రాత్రి జరిగింది. యాదగిరిగుట్ట నుంచి తుర్కపల్లికి వెళుతున్న ట్రాక్టర్ అదే రూట్లో ఎదురుగా వస్తున్న ఓ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ వెంకటేష్, చిన్నం సంతోష, మల్గ మంగమ్మ, యాదగిరి, యాదమ్మకు స్వల్పగాయాలయ్యాయి. వీరు తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో బంధువు అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను భువనగిరి ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురిది యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామం కాగా, మరో ఇద్దరిది మోటకొండూర్ మండలం వర్టూర్ గ్రామం అని సమాచారం.

డివైడర్‌ను ఢీకొని ఆస్పత్రి పాలైన ముగ్గురు యువకులు

- క్షతగాత్రుల్లో ఇద్దరు 'శాలిగౌరారం' వాసులు

శాలిగౌరారం: స్నేహితుడి వివాహానికి హాజరైన ముగ్గురు యువకులు తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. వారిలో శాలిగౌరారం మండలానికి చెందిన ఇద్దరు ఉన్నారు. శాలిగౌరారం మండలం అడ్లూరు గ్రామానికి చెందిన మాచర్ల శ్రీధర్, బాలిశెట్టిగూడేనికి చెందిన పొట్టేటి రఘురామ్, హైదరాబాద్‌కు చెందిన శ్రవణ్ స్నేహితులు. వీరు ఈ నెల 9న ఇబ్రహీంపట్నంలో జరిగిన వివాహానికి హాజరయ్యారు. 10న శ్రీధర్‌కు డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఉండటంతో వివాహమైన స్నేహితుడి ఇంటినుంచి అదే రోజు తెల్లవారుజామున బైక్‌పై ఎల్‌బీనగర్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో మన్నెగూడ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారంతా హైదరాబాద్‌లోనే వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష పాసైన శ్రీధర్

ప్రమాదంలో గాయపడిన అడ్లూరు గ్రామానికి చెందిన మాచర్ల శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. ఈ నెల మూడవ వారంలో శ్రీధర్ ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంది. కొడుకు పరిస్థితిని చూసి శ్రీధర్ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

పద్మశాలి సంఘం 'పేట' కన్వీనర్‌గా గోవిందరావు


గోవిందరావు

హుజూర్‌నగర్: తెలంగాణ పద్మశాలి సంఘం సూర్యాపేట జిల్లా కన్వీనర్‌గా హుజూర్‌నగర్‌కు చెందిన బొడ్డు గోవిందరావును నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రభాకర్, కె.మురళి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ తనను పద్మశాలి సంఘం జిల్లా కన్వీనర్‌గా నియమించడం పట్ల సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల కొరత, నిధుల లేమితోనే మూసివేత

నల్లగొండ టూటౌన్: విద్యార్థుల కొరత, నిధుల లేమితోనే నల్లగొండలోని డ్వాబ్ సంస్థచే నెలకొల్పిన అంధుల పాఠశాలను మూసివేసినట్లు అంధుల అభివృద్ధి, సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంధుల అభివృద్ధి, పురోగతి కేవలం కాగితాలపైనే చూపిస్తున్నారు తప్ప క్షేత్రస్థాయిలో కనిపిస్తలేదని వాపోయారు. అంధుల పాఠశాలలను హేతుబద్ధీకరించాలని కోరారు. విద్యార్థులకంటే ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఎక్కువ ఉంటున్నారని, వ్యయభారం అవుతుందని పేర్కొన్నారు.

'రీజినల్' రైతులకు బెయిల్ మంజూరు

భువనగిరి : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ నిర్వహించిన ఆందోళనలో అరెస్ట్ అయ్యి, జైలులో ఉన్న రైతులకు సోమవారం భువనగిరి సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. గత మే 30న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జరిగిన ఆందోళనలో పాల్గొన్న ఆరుగురిపై పోలీసులు 147, 148, 436, 427, 353, 120బి, 149 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇందులో బీజేపీ నాయకుడు గూడూరు నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు తంగళ్లపల్లి రవికుమార్‌కు ముందస్తు బెయిల్ లభించింది. గడ్డమీది మల్లేశం, పల్లెర్ల యాదగిరి, అవుశెట్టి నిఖిల్, మల్లెబోయిన బాలును అదేరోజు కోర్టులో హాజరుపరిచి భువనగిరి జైలులో రిమాండ్ చేశారు. అనంతరం భద్రతా కారణాల దృష్ట్యా నల్లగొండ జైలుకు తీసుకెళ్లగా బెయిల్‌పై విడుదలయ్యారు.

పాము కాటుతో బాలిక మృతి

ఆలేరురూరల్ : పాము కాటుతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక మృతిచెందింది. ఆలేరు మండలంలోని శారాజీపేటకు చెందిన జెరిపోతుల రమ్య (15) శనివారం గొలనుకొండలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. రాత్రి భోజనం చేశాక రమ్య ఇంటి ముందు వరండాలో పడుకుంది. ఆదివారం ఉదయం నిద్ర లేవగానే నోటినుంచి నురుగల రావడంతో కుటుంబ సభ్యులు ఆలేరులోని వైద్యులకు చూపించారు. పాము కాటుకు గురైందని తెలియడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందింది. సోమవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. రమ్య చదువుకుంటున్న స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రమ్య మృతికి నివాళులర్పించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

హుజూర్‌నగర్ : ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. హుజూర్‌నగర్‌కు పట్టణానికి చెందిన వేముల లక్ష్మి (36) భర్త విజయ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు.అయినా అతను పూర్తి స్థాయిలో కోలుకోలేదు. వారికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. భర్త అనారోగ్యంతో ఉండటంతో పాటు లక్ష్మికి మతిస్థిమితం లేదు. ఈ నేపథ్యంలో సోమవారం ఆమె ఒక్కతే ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకుని ఉరి వేసుకుంది. స్థానికులు గమనించి ఆమెను ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిందని నిర్ధారించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు.

పెళ్లి బృందం టాటాఏస్ వాహనం బోల్తా

- పది మందికి గాయాలు
- డ్రైవర్ మద్యం మత్తే ప్రమాదానికి కారణం
- మఠంపల్లి మండల పరిధిలో ఘటన

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం రఘునాథపాలెం వద్ద సోమవారం పెళ్లిబృందం వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో పది మందికి గాయాలయ్యాయి. చింతలపాలెం మండలం నక్కగూడేనికి చెందిన పెదపుల్లయ్య తన మనుమరాలు వివాహం ఆదివారం హుజూర్‌నగర్‌కు చెందిన యువకుడితో స్థానికంగా జరిపించారు. అదే రోజు సాయంత్రం వధూవరులతో కుటుంబ సభ్యులు, బంధువులు వరుడి స్వగ్రామం హుజూర్‌నగర్ చేరుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత బంధువులతో కలిసి హుజూర్‌నగర్ నుంచి స్వగ్రామం నక్కగూడేనికి టాటాఏస్ వాహనంలో బయలుదేరారు. రఘునాథపాలెం గ్రామ సమీపంలోకి రాగానే డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. ప్రమాదంలో వాహనంలో ఉన్న పెదపుల్లయ్య, గోపమ్మ, జ్యోతి, రమాదేవి, అవినాష్, చినగోపయ్య, సైదమ్మ, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనాల్లో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో సూర్యాపేట, హైదరాబాదుకు తరలించినట్లు తెలిసింది. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని మఠంపల్లి పోలీసులు తెలిపారు.

బావిలో మునిగి యువకుడు మృతి


మహేష్ (ఫైల్)

చిట్యాల : వ్యవసాయ బావిలో మునిగి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఉరుమడ్ల గ్రామానికి చెందిన జన్నపాల లింగస్వామి కుమారుడు మహేష్(18) ఇంటర్ పూర్తి చేశాడు. సోమవారం స్నేహితులతో కలిసి మహేష్ గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్దకు ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. వీపునకు ప్లాస్టిక్ డబ్బాలను కట్టుకుని బావిలో ఈత కొడుతున్నాడు. కాసేపటి తర్వాత వీపునకు కట్టుకున్న ప్లాస్టిక్ డబ్బాలు తొలగిపోవడంతో మహేష్ నీట మునిగాడు. గుర్తించిన స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసేటప్పటికీ బావిలో పూర్తిగా అడుగు భాగానికి చేరిపోయాడు. గుర్తించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక శాఖ అధికారులు బావిలోని నీటిని తోడి రాత్రి పది గంటల ప్రాంతంలో మృతదేహాన్ని వెలికి తీశారు. చేతికి వచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఉరుమడ్లలోని వ్యవసాయ బావిలో గాలింపు చర్యలు, గుమిగూడిన గ్రామస్తులు

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. భువనగిరి మండలం ఝిత్రంబల్లి గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఝిత్రంబల్లికి చెందిన గడ్డల కృష్ణస్వామి(53) తన కుమారుడు శ్రీకాంత్‌తో కలిసి ఆదివారం రాత్రి గ్రామ శివారులోని ఐకేపీ కేంద్రానికి వెళ్లారు. యంత్రంలో వరిధాన్యంలోని తాలును తీసే పనికి ఉపక్రమించారు. ఈ క్రమంలో యంత్రం వెనుక భాగంలోని విద్యుత్ వైరు తెగి కృష్ణస్వామికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే శ్రీకాంత్ గమనించి తండ్రిని భువనగిరి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. కాగా, మృతుడి కుటుంబ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ పాశం శివానంద్, తదితరులు ఉన్నారు.

బాలల రక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న మురళీమోహన్

భువనగిరి: బాలలు జాతి సంపద అని, వారి రక్షణ అందరి బాధ్యత అని జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కె.మురళీమోహన్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భువనగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా మార్చాలన్నారు. బాలకార్మిక వ్యవస్థను, బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించడం ద్వారా సత్ఫలితాలను సాధించవచ్చన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్మిక శాఖధికారి మొయినుద్దీన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు శివరాజ్, మల్లేశం, లావణ్య పాల్గొన్నారు.

కుమారుడిని హత్య చేసిన తండ్రి

- డబ్బులు ఇవ్వాలని తండ్రిపై కుమారుడి ఒత్తిడి
- తట్టుకోలేక కొడుకు తలపై రోకలిబండతో మోది, కత్తితో పొడిచి హత్య
- ఆపై నేరుగా పోలీస్ స్టేషన్‌లో లొంగుబాటు
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘటన


సతీష్ (ఫైల్)

సూర్యాపేట క్రైం : కుమారుడిని తండ్రి హత్య చేసిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. సూర్యాపేట పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన చీమల లింగయ్య, మంగమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు సతీష్ (34) సంతానం. ఇద్దరికి వివాహాలు జరిపించారు. లింగయ్య వ్యవసాయంతో పాటు చిన్నాచితకా వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సతీష్ కొంతకాలం గొర్రెల కాపరిగా పనిచేసి జులాయిగా తిరుగుతున్నాడు. కుటుంబంలో గొడవలు జరగడంతో నాలుగేళ్ల క్రితం సతీష్ భార్య విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. సతీష్ పూర్తిగా మద్యానికి బానిసగా మారాడు. డబ్బుల కోసం తల్లిదండ్రులను నిత్యం వేధించడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చిన సతీష్ సోమవారం తెల్లవారుజామున డబ్బులు కావాలని తల్లిదండ్రులపై దాడికి పూనుకున్నాడు. తల్లిదండ్రులు అతడికి ఎంత నచ్చచెప్పినా వినిపించుకోలేదు. ఇటీవల ధాన్యం విక్రయించిన డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు.

రోకలిబండతో మోది.. కత్తితో పొడిచి

కుమారుడి వేధింపులు తట్టుకోలేకపోయిన లింగయ్య తీవ్ర ఆగ్రహావేశానికి లోనయ్యాడు. ఇంట్లో ఉన్న రోకలిబండతో సతీష్ తలపై బలంగా మోదడంతో కిందపడిపోయాడు. ఆపై లింగయ్య మటన్ కోసే కత్తితో పలుమార్లు పొడవడంతో సతీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం లింగయ్య నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. సూర్యాపేట సీఐ రాజశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. సతీష్ తల్లి ఫిర్యాదు మేరకు లింగయ్యపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.